ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్

- గవర్నర్ కోటాలో నియామకం.. తమిళిసై ఆమోదం

హైదరాబాద్, జనవరి 25(నమస్తే తెలంగాణ): గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, జర్నలిస్ట్ అమీర్ అలీఖాన్ నియమితులయ్యారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరాంతోపాటు సియాసత్ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడు అమీర్ అలీఖాన్ పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నేపథ్యంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఆమోదం తెలిపారు. దీంతో వీరిని ఎమ్మెల్సీలుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, గవర్నర్ తిరస్కరించారు. దీనిపై బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వీరిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించింది. ప్రొఫెసర్ కోదండరాం పూర్తి పేరు ముద్దసాని కోదండరాంరెడ్డి. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం నెన్నెల్ గ్రామంలో వెంకటమ్మ, జనార్దన్‌రెడ్డి దంపతులకు 1955 సెప్టెంబర్ 5న జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్‌గా పని చేసి రిటైరయ్యారు. పౌరహక్కుల ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన కోదండరాం తెలంగాణ ఉద్యమంలోనూ క్రియాశీల పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో ఏర్పాటైన టీజేఏసీకి కన్వీనర్‌గా వ్యవహరించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత తెలంగాణ జనసమితి పేరుతో ప్రత్యేక పార్టీని ఏర్పాటు చేశారు.

పాత్రికేయ వృత్తిలో అమీర్ అలీఖాన్

ఇటీవల మృతి చెందిన సియాసత్ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడైన అమీర్ అలీఖాన్ 1973 అక్టోబర్ 18న హైదరాబాద్‌లో జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి జర్నలిజంలో డిగ్రీ పొందిన ఆయన 1994 నుంచి పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్నారు. ప్రముఖ ఉర్దూ పత్రిక సియాసత్ విస్తర్ణకు ఎంతగానో కృషి చేశారు. పాత్రికేయ వృత్తిలో భాగంగా పలు జాతీయ, అంతర్జాతీయ ఈవెంట్లను కవర్ చేశారు.

రాజీనామా యోచనలో అజారుద్దీన్?

- కాంగ్రెస్‌లో ముసలం పుట్టించిన ఎమ్మెల్సీ పదవులు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవుల భర్తీ కాంగ్రెస్‌లో ముసలం పుట్టించింది. తనకు ఎమ్మెల్సీ ఇవ్వకపోవడంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్ తీవ్ర మనస్తాపం చెందారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఇస్తామని పార్టీ పెద్దలు తనకు హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు వేరే వాళ్లకు దానిని కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కోసం పని చేసిన వారికి కాకుండా అమీర్ ఆలీఖాన్‌కు ఎలా పదవి ఇస్తారని మండిపడ్డారు. తాను పార్టీ కోసం 18 ఏండ్లుగా పని చేస్తున్నానని గుర్తుచేశారు. ఏఐసీసీ పెద్దలతో మాట్లాడిన తర్వాత తన నిర్ణయం ప్రకటిస్తానని అజారుద్దీన్ చెప్పారు.

రఘునందన్ నోరు జాగ్రత్త

- హరీశ్ జోలికి వస్తే సహించం
- రేవంత్ పీఎంని కలిస్తే తప్పు కాదా?
- మేము సీఎంని కలిస్తే తప్పేంటి?
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫైర్

తొగుట, జనవరి 25 : దుబ్బాక నుంచి అసెంబ్లీకి పోటీచేసి బొక్కబోర్లా పడ్డా బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఇంకా జ్ఞానోదయం కలుగలేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఆయన పెద్దమాసాన్‌పల్లిలో మీడియాతో మాట్లాడారు. నాడు తెలంగాణ ఉద్యమంలో, నేడు తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన హరీశ్‌రావుపై రఘునందన్‌రావు నోరుపారేసుకోవడం తగదన్నారు. తీరు మారకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దుబ్బాక ఉప ఎన్నికలో అత్తెసరు మెజార్టీతో గెలిచిన రఘునందన్‌రావు ఎన్నికల హామీల్లో ఒక్క పనైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. తాము సీఎం రేవంత్‌రెడ్డిని కలవడమే పాపమన్నట్టు మాట్లాడుతున్నారని, సీఎం కాంగ్రెస్ పార్టీకా? రాష్ట్రానికా? తెలుసుకోవాలని సూచించారు. ప్రజలకిచ్చిన హామీల కోసం సీఎంతో పాటు మంత్రులను కలుస్తానని చెప్పారు. ప్రధాని మోదీని రేవంత్ కలిసినప్పుడు ఈ నోళ్లు మూసుకుపోయాయా అని ప్రశ్నించారు.

నాడు ఫోన్ చేస్తే నీళ్లు వచ్చేవి

తాము అధికారంలో ఉన్నప్పుడు ఒక్క ఫోన్ చేస్తే మల్లన్న సాగర్ జలాలు కాలువల పొంటి పారేవని, నేడు పొలాలు ఎండిపోతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసినా కూడవెల్లి వాగులోకి నీళ్లు విడుదల చేయలేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్న సాగర్ ప్రధాన కాలువకు సైతం మంత్రి కొండా సురేఖ రాత్రిళ్లు వెళ్లి నీటిని విడుదల చేసి స్థానిక ప్రజాప్రతినిధులను అవమానించినట్టు తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి

- ఐదుగురు సభ్యుల నియామకం
- గవర్నర్ ఆమోదంతో సర్కారు ఉత్తర్వులు
- బోర్డులో ఇంకా ఖాళీగా 5 పోస్టులు

పాల్వాయి రజినీకుమారి, నర్రి యాదయ్య (ఫైల్)

సూర్యాపేట/సంస్థాన్ నారాయణపురం/హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గవర్నర్ తమిళిసై ఆమోద ముద్రవేయగా ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌తో పాటు మరో ఐదుగురు సభ్యులను కూడా ప్రభుత్వం నియమించింది. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తో పాటు సభ్యులు రాజీనామా చేయటంతో నూతన కమిషన్ నియామకం కోసం తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. చైర్మన్ పదవి కోసం 50 మంది, సభ్యుల కోసం 321 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, శాఖ కార్యదర్శి తిరుపతి, సాధారణ పరిపాలనశాఖ (సర్వీసెస్) కార్యదర్శి నిర్మలతో కూడిన స్క్రీనింగ్ కమిటీ సమావేశమై మహేందర్‌రెడ్డితో పాటు, ఓ విశ్రాంత ఐపీఎస్ అధికారి, త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న మరో ఐపీఎస్ అధికారి పేర్లతో జాబితాను ఎంపిక చేసింది. వారిలో మహేందర్‌రెడ్డి ఒక్కరే తెలంగాణకు చెందినవారు కాగా ప్రభుత్వం ఆయన నియమకానికే ఎక్కువగా మొగ్గు చూపింది. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి పేరును ప్రభుత్వం ప్రతిపాదించగా గవర్నర్ ఆమోదించారు. ఐదుగురు సభ్యుల్లో విశ్రాంత ఐఏఎస్ అనితారాజేంద్ర, ఇండియన్ పోస్టల్ సర్వీస్ విశ్రాంత ఉద్యోగి అమీర్ ఉల్లాఖాన్, జేఎన్టీయూ ప్రొఫెసర్ నర్రి యాదయ్య, యరబాది రామ్మోహన్ రావు, పాల్వాయి రజనీకుమారి ఉన్నారు.

ఖాళీగా మరో 5 పోస్టులు

టీఎస్‌పీఎస్సీలో చైర్మన్ సహా మొత్తం 11 మంది సభ్యులు ఉండాలి. పేపర్ లీకేజీ పరిణామాల నేపథ్యంలో గత చైర్మన్‌తో పాటు ముగ్గురు సభ్యులు రాజీనామా చేశారు. మిగతా ఐదుగురు సభ్యుల పదవీకాలం అప్పటికే ముగిసింది. మిగిలిన ఇద్దరు సభ్యుల్లో సుమిత్రా ఆనంద్ తనోబా రాజీనామా సమర్పించగా ఇప్పటికీ గవర్నర్ వద్ద పెండింగ్‌లోనే ఉన్నది. ఆమోదించారా? లేదా? అనేదానిపై స్పష్టత లేదు. మరో సభ్యురాలు అరుణకుమారి ఇప్పటికీ కొనసాగుతున్నారు. వెరసి మొత్తంగా 11 సభ్యుల్లో 10 స్థానాలు ఖాళీగా ఉండగా ప్రస్తుతం చైర్మన్‌తో పాటు ఐదుగురు సభ్యులను నియమించారు. ఇంకా నలుగురు సభ్యులను నియమించాల్సి ఉన్నది. సుమిత్రా ఆనంద్ తనోబా రాజీనామాను ఆమోదిస్తే మొత్తంగా ఆమె స్థానాన్ని కలిపి 5 సభ్యులను నియమించాల్సి ఉంటుంది. కాగా, సభ్యుల్లో పాల్వాయి రజనీకుమారి మాత్రమే ఆరేండ్ల పాటు పూర్తికాల పరిమితిని పూర్తిచేసుకొనే అవకాశం ఉంది. మిగతా వారందరూ వయసు రీత్యా మధ్యలోనే రిటైర్ అవుతారు. గతంలో సభ్యురాలిగా నియమితులైన కోట్ల అరుణకుమారి 2021లో మే 21న పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆమె 2027 వరకు సభ్యురాలిగా కొనసాగుతారు.

11 నెలల పాటే చైర్మన్

టీఎస్‌పీఎస్సీలో చైర్మన్‌గా నియమితులైన మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి ఆ పదవిలో 11నెలల పాటే కొనసాగే అవకాశం ఉన్నది. టీఎస్‌పీఎస్‌పీ చైర్మన్‌గా, కమిషన్ సభ్యులుగా నియమితులైనవాళ్లు 62 ఏండ్లు వచ్చేవరకు, లేదంటే 6 ఏండ్ల పాటు మాత్రమే ఆ పదవిలో కొనసాగాల్సి ఉంటుంది. మహేందర్‌రెడ్డి 1962లో డిసెంబర్3న జన్మించగా ప్రస్తుతం ఆయన వయసు 61 సంవత్సరాల 1 నెల 22 రోజులు. మరో 11 నెలల గడిస్తే ఆయన 62 ఏండ్ల వయస్సును దాటిపోతారు. ఈ నేపథ్యంలోనే చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి 11 నెలల పాటే కొనసాగే అవకాశం ఉన్నది. జేఎన్టీయూకు చెందిన ఇద్దరు టీఎస్‌పీఎస్సీలో కీలక పోస్టుల్లో నియమితులు కావటం పట్ల వర్సిటీ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు యూనివర్సిటీ వీసీ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ మంజూరుహుస్సేన్, డైరెక్టర్ డాక్టర్ గోవర్ధన్ తదితరులు వారికి శుభాకాంక్షలు తెలియచేశారు.

బీటెక్ గోల్డ్ మెడలిస్ట్.. మహేందర్‌రెడ్డి

1986 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన మహేందర్‌రెడ్డి స్వస్థలం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కిష్టాపురం గ్రామం. 5-7వ తరగతి వరకు స్వగ్రామంలో జడ్పీహెచ్ఎస్‌లో చదువుకున్న ఆయన కూసుమంచిలోని ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి, వరంగల్ నిట్‌లో బీటెక్ పూర్తిచేసి గోల్డ్ మెడల్ సాధించారు. ఐఐటీ ఢిల్లీలో ఎంటెక్ చదువుతుండగానే 1986లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. తొలుత విశాఖపట్నం ట్రైనీ ఏఎస్పీగా నియమితులయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రామగుండం ఏఎస్పీగా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత హైదరాబాద్ కమిషనర్‌గా నియమితులయ్యారు. 2017 నవంబర్‌లో డీజీపీగా బాధ్యతలు స్వీకరించి 2022 డిసెంబర్ వరకు ఆ పదవిలో కొనసాగారు.

గౌడల్లో తొలి మహిళా ఐఏఎస్

రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగీర్ కిస్మత్‌పూర్‌కు చెందిన విశ్రాంత ఐఏఎస్ అనిత రాజేంద్ర ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్ఎం పట్టా అందుకున్నారు. గౌడ సామాజిక వర్గంలో ఐఏఎస్ సాధించిన మొదటి మహిళగా గుర్తింపు పొందారు. 1992లో సర్వీస్‌లో చేరిన ఆమె వివిధ హోదాల్లో సేవలందించారు. ఎంసీహెచ్ఆర్డీ అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తూ గత ఏడాది ఉద్యోగ విరమణ పొందారు.

ఆర్థిక, విద్యా విధానాలపై అనేక వ్యాసాలు

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌కు చెందిన ఉన్నత విద్యావంతుల కుటుంబంలో జన్మించిన అమీర్ ఉల్లాఖాన్ 1983లో ఇండియన్ పోస్టల్‌సర్వీసెస్‌లో చేరారు. 1995లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకున్నారు. అనంతరం కేంద్ర ఆర్థికశాఖ నేతృత్వంలో యూఎన్‌డీపీలో ప్రవేశించారు. ఉర్దూ వర్సిటీలో సివిల్ సర్వీసెస్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్‌గా, ఎంసీహెచ్ఆర్డీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు.

ప్రైవేట్ టీచర్ నుంచి టీఎస్‌పీఎస్సీ సభ్యురాలిగా..

సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన పాల్వాయి రజనీకుమారి ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎల్ఎల్‌బీ, బీఈడీ పూర్తి చేశారు. తొలుత కొంతకాలం ప్రైవేట్ టీచర్‌గా పనిచేశారు. 2000లో గ్రూప్-3 ద్వారా వీడీవో ఉద్యోగం సాధించారు. అదే సంవత్సరం గ్రూప్-1కు ఎంపికై ఖైరతాబాద్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌గా, తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. 2004లో ఉద్యోగానికి రాజీనామా చేసి సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2014లో తుంగతుర్తి నుంచి బరిలో నిలిచి ఓటమి పాలయ్యారు. 2017లో బీజేపీలో చేరి అధికార ప్రతినిధిగా పనిచేశారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు

టీఎస్‌పీఎస్సీ బోర్డు మెంబర్‌గా నియమితులైన నర్రి యాదయ్య యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని మల్లారెడ్డిగూడెంకు చెందినవారు. ప్రస్తుతం ఆయన జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్, 1988లో ఖరగ్‌పూర్ ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేశారు. 2000లో జేఎన్టీయూహెచ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి 2006లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు.

ఏఈ నుంచి అంచెలంచెలుగా..

ఎరుకల సామాజిక వర్గానికి చెందిన రామ్మోహన్‌రావు 1963లో జన్మించారు. 1984లో ఆంధ్రా యూనివర్సిటీలో బీఈ సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. సిక్కిం మణిపాల్ యూనివర్సిటీ నుంచి 2011లో ఎంబీఏ పూర్తిచేశారు. 1986లో విద్యుత్తు శాఖలో ఏఈగా ఉద్యోగంలో చేశారు. శ్రీశైలం, జూరాల, కేటీపీఎస్ విద్యుత్తు ప్రాజెక్టుల్లో ఎస్ఈగా, సీఈగా సేవలందించారు. ప్రస్తుతం టీఎస్‌జెన్‌కో ఈడీ (సివిల్ హైడల్)గా కొనసాగుతున్నారు.

లోకం పోకడ

తన జుట్టు ఎంత స్ట్రాంగో సాటి మహిళగా తెలుసుకోవాలని ఫ్రెండ్లీగా టెస్ట్ చేస్తున్నామయ్యా!

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	10.0°c	27.1°c
మెదక్	15.3°c	32.9°c
నిజామాబాద్	16.0°c	27.5°c
కరీంనగర్	17.0°c	29.0°c
రంగారెడ్డి	17.2°c	34.0°c
వరంగల్	18.0°c	29.0°c
ఖమ్మం	18.0°c	31.0°c
నల్లగొండ	20.0°c	32.9°c
మహబూబ్‌నగర్	21.0°c	31.3°c
హైదరాబాద్	30.5°c	31.2°c

చెన్నైకి మన కార్నింగ్

రెండో పేజీ తరువాయి...

గత 7-8 నెలలు తీవ్ర కసరత్తు చేశారు. అప్పటి కేసీఆర్ సర్కారు చూపిస్తున్న చొరవ, ప్రోత్సాహకాలు వారిని ఆకర్షించాయి. దీంతో తెలంగాణను తమ ఉత్పత్తి ప్లాంట్‌కు కేంద్రంగా ఎంచుకోవాలనుకొన్నారు. రూ.934 కోట్ల పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు చేయాలని గత సెప్టెంబర్‌లో నిర్ణయించారు. హైదరాబాద్‌లో కార్నింగ్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా దాదాపు 800 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అప్పటి మంత్రి కేటీఆర్ కూడా పేర్కొన్నారు. అయితే, నవంబర్ చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అంతే, ఫలితాలు విడుదలై 15 రోజులు కాకుండానే.. కార్నింగ్ ప్లాంట్ హైదరాబాద్ నుంచి చెన్నైకి తరలిపోతున్నదంటూ జాతీయ పత్రిక 'ఎకనమిక్ టైమ్స్'లో ఓ కథనం ప్రత్యక్షమైంది. దీంతో నిజానిజాలు తెలుసుకోవడానికి 'నమస్తే తెలంగాణ' బృందం అటు పత్రిక ప్రతినిధులతో పాటు కార్నింగ్ కంపెనీని కూడా సంప్రదించింది. తరలింపు మాట నిజమేనని ఇరువర్గాలు పేర్కొన్నాయి. ఇదే విషయాన్ని ప్రధానంగా హైలైట్ చేస్తూ.. డిసెంబర్ 13, 2023న (బుధవారం) 'హైదరాబాద్‌కు కార్నింగ్ గుడ్‌బై' పేరిట నమస్తే తెలంగాణ బ్యానర్ వార్తను ప్రచురించింది. అయితే, కంపెనీ తరలింపును అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అప్పుడు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

ప్రకటన వచ్చాక.. ప్రయత్నాలు

తెలంగాణ నుంచి ప్లాంట్‌ను తరలించడానికి నిర్ణయించుకొన్న కార్నింగ్.. తమిళనాడులో రూ.1,003 కోట్లతో ప్లాంట్ ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం తమిళనాడు సర్కారుతో ఎంవోయూ కుదుర్చుకొన్నది. చెన్నై సమీపంలోని కాంచీపూరం జిల్లాలో ఉన్న పిల్లాయిపక్కమ్‌లో 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నది. ప్లాంట్ ఏర్పాటుతో 840 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకొన్న తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు కార్నింగ్ కంపెనీ ప్రతినిధులతో సంప్రదింపులను ముమ్మరం చేసినట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఐటీ కార్యదర్శి జయేశ్‌రంజన్, కొందరు ప్రభుత్వాధికారులు ప్రస్తుతం ఇదే పనిలో నిమగ్నమైనట్టు సమాచారం. కాగా, కంపెనీ తరలింపు వార్తలు వెలుగుచూసినప్పుడే, ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపడితే, ఈ పరిస్థితి వచ్చేదికాదని పలువురు విమర్శిస్తున్నారు. సర్కారు ఉదాసీన వైఖరి కారణంగానే తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు దూరమయ్యాయని, రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులు చేజారిపోయిందని మండిపడుతున్నారు.

ప్రపంచానికి మార్గదర్శకంగా మన రాజ్యాంగ స్ఫూర్తి

- ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): ప్రజాస్వామిక పాలన ద్వారానే రాజ్యాంగం ఆశించిన లక్ష్యాలు అన్ని వర్గాల ప్రజలకు అందుతాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వంతోపాటు అందరికీ న్యాయం అందాలనే రాజ్యాంగ స్ఫూర్తి ఇప్పటికీ, ఎప్పటికీ ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ సగర్వంగా వేడుకలు జరుపుకోవాలని, రాజ్యాంగ నిర్మాతలను, దేశాన్ని సమున్నతంగా నిలబెట్టిన మహనీయులను గుర్తు చేసుకోవాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. తమ ప్రభుత్వం రాజ్యాంగ ఆశయాలు, లక్ష్యాలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉంటుందని చెప్పారు. అధికారం చేపట్టిన మొదటిరోజు నుంచే తమ ప్రభుత్వం ప్రజా పాలనకు శ్రీకారం చుట్టిందని, ప్రజలే పాలకులనే జవాబుదారీతనంతో పని చేస్తున్నదని స్పష్టం చేశారు.

మళ్లీ బీజేపీ వస్తే ప్రజాస్వామ్యం ఖూనీ

- మోదీ మాయలో పడకుండా ప్రజలను చైతన్యపర్చాలి
- తెలంగాణ దేశానికే మాడల్ రాష్ట్రంగా మారాలి
- కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే
- ఫిబ్రవరి నెలాఖరుకల్లా అందరికీ రైతుభరోసా
- ఇకనుంచి రోజు విడిచి రోజు ప్రజల మధ్యే ఉంటా
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

ఎల్బీస్టేడియంలో కాంగ్రెస్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హెచ్చరించారు. ప్రధాని మోదీకి రైతుల బాధలు, కష్టాలు తెలియవని, దేశంలో నిరుద్యోగం పెరిగిందని, ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం అయిందని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ మాయమాటల్లో పడకుండా ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపైనే ఉన్నదని చెప్పారు. సంక్షోభంలో ఉన్నప్పుడే మోదీకి పాకిస్తాన్, చైనా, దేవుడు గుర్తుకు వస్తారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి పార్టీ జాతీయ నాయకులతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరై లోక్‌సభ ఎన్నికలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు దేశంలోనే ఒక మాడల్ కావాలని ఆకాంక్షించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజల శ్రేయస్సు కోసమే కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను గద్దె దించేందుకు రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపట్టారని వివరించారు.

ఫిబ్రవరి నెలాఖరుకల్లా రైతుభరోసా

ఫిబ్రవరి నెలాఖరుకల్లా రైతులు అందరికీ రైతుభరోసా సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రమాణ స్వీకారం చేసిన రోజే ప్రకటించామని గుర్తుచేశారు. ఫిబ్రవరిలో మరో రెండు హామీలను అమలు చేస్తామని వెల్లడించారు. ఇకనుంచి తాను రోజు విడిచి రోజు రాష్ట్రంలో పర్యటిస్తూ ప్రజల మధ్యనే ఉంటానని తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 14 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించి తీరుతామని చెప్పారు. పార్టీ కార్యకర్తలు రాహుల్ గాంధీని ప్రధాని సీట్లో కూర్చొబెట్టే లక్ష్యంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించింది కాంగ్రెస్సేనని, ప్రాణత్యాగాలకు వెరవకుండా పనిచేసింది నెహ్రూ కుటుంబమేనని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకులు మధుయాష్కీ, షబ్బీర్ అలీ తదితరులు ప్రసంగించారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాసు మున్షీ తదితరులు హాజరయ్యారు.

సీఎం దిగజారుడు వ్యాఖ్యలు

- ప్రత్యర్థులకు హింసాత్మక హెచ్చరికలు
- స్థాయి మరిచి దాడికి దిగుతున్న రేవంత్
- బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): అధికారం ఇస్తున్న కిక్కు ముఖ్యమంత్రిని విజ్ఞత మరిచేలా చేస్తున్నది. సీఎం పీఠమెక్కి రెండు నెలలైనా కాలేదు అప్పుడే తన రాజకీయ ప్రత్యర్థులకు హింస్మాత్మకంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గొంతు పిసుకుతాం.. గొయ్యి తొవ్వుతాం.. బొంద పెడ్తాం అంటూ బెదిరిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యున్నతమైన అధికార పదవిలో కొనసాగుతున్న ఓ వ్యక్తి నుంచి ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు విస్మయం గొల్పుతున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు మరోసారి తమకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నందునే బీఆర్ఎస్‌పై ఆయన విరుచుకుపడుతున్నారని అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అలవిగాని హామీలనిచ్చి, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని.. వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నందుకే ప్రత్యర్థి పార్టీలను ముఖ్యంగా బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకొంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గురువారం జరిగిన కాంగ్రెస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగం బీఆర్ఎస్ పట్ల ఆయన అసహనానికి అద్దం పట్టిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సీఎం తన స్థాయిని, హోదాను మరిచి బీఆర్ఎస్‌ను 'బొంద' పెడ్తాం, రాష్ట్రం నుంచి '